ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లిలో బీఆర్ఎస్ నేత రాయల శేషగిరిరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లిలో బీఆర్ఎస్ నేత రాయల శేషగిరిరావు కాంస్య విగ్రహావిష్కరణ సభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

దివాలాకోరు సీఎం రేవంత్

నా రాజకీయ అనుభవంలో ఏ సీఎం కూడా ఇంత దిగజారుడు మాటలు మాట్లాడలేదు

- కేసీఆర్ పథకాల రద్దే కాంగ్రెస్ పాలన లక్ష్యం
- స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి
- ఇంటి పార్టీలే ముద్దు.. ఢిల్లీ పార్టీలను నమ్మొద్దు
- గులాబీ జెండానే రాష్ట్ర ప్రజల గుండె ధైర్యం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మిట్టపల్లిలో శేషగిరిరావు విగ్రహం ఆవిష్కరణ
- ఐఎన్‌టీయూసీ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

ఖమ్మం, మే 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రేవంత్‌రెడ్డి దివాలాకోరు సీఎం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇన్నేండ్ల తన రాజకీయ అనుభవంలో ఏ ముఖ్యమంత్రి కూడా రేవంత్‌రెడ్డిలా దివాలాకోరు మాటలు మాట్లాడలేదని చెప్పారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, దివంగత రాయల శేషగిరిరావు కాంస్య విగ్రహాన్ని కేటీఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షతన మిట్టపల్లిలో జరిగిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. దివంగత రాయల శేషగిరిరావు తన జీవితం మొత్తం ఈ ప్రాంత రైతుల కోసమే ధారపోశారని గుర్తుచేశారు. పార్టీ కోసం, పేదల అభ్యున్నతి కోసం శేషగిరిరావు చేసిన సేవలను కొనియాడారు. ఢిల్లీకి పోతే దొంగల్లా చూస్తున్నారని, కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని, చెప్పులు ఎత్తుకుపోయేటోడిలా చూస్తున్నారని రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను గుర్తుచేస్తూ తూర్పారబట్టారు. 'ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన దొంగను దొంగలా చూడకుంటే దొరలా చూస్తారా?' అంటూ ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండి కూడా ఏం ప్రయోజనం జరిగిందో జిల్లా ప్రజలు ఆలోచించాలని కోరారు. పదేండ్లలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ జిల్లాలో 10 లక్షల ఎకరాలకు నీరందించే అద్భుత సీతారామ ప్రాజెక్టును నిర్మించారని గుర్తుచేశారు.



ఐఎన్‌టీయూసీ ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యాకుబ్‌పాషాను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

బాండ్ పేపర్లు రాసి 'భట్టి' మోసం

ఖమ్మం జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. మధిరలో బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజుపై గెలిచేందుకు అఫిడవిట్లు రాసిచ్చారని, దేవుడి దగ్గర బాండ్ పేపర్లపై సంతకాలు చేసిచ్చారని, అనేక విధాలుగా ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారని విమర్శించారు. 17 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలకు జరిగిన మేలేమీ లేదని, ఉన్న పథకాలకు కూడా దిక్కులేకుండా పోయిందని విమర్శించారు. అద్భుతమైన కేసీఆర్ కిట్టు కార్యక్రమాన్ని కూడా ఎత్తేశారని మండిపడ్డారు.

రుణమాఫీ పేరిట ద్రోహం

రైతులందరూ వెంటనే బ్యాంకులకు వెళ్లి పంట రుణాలు తెచ్చుకోవాలని, డిసెంబర్ 9న తొలి సంతకం రుణమాఫీ ఫైలు పైనే పెడతామంటూ రైతులకు హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. వారిని నిలువునా మోసం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. ఆడబిడ్డల ఓట్ల కోసమే కాంగ్రెస్సోళ్లు నాడు ఫ్రీ బస్సు, తులం బంగారం అంటూ హామీలిచ్చారని విమర్శించారు. హామీల వలలో పడి ఆడబిడ్డలు మోసపోయి గోసపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

'స్థానికం'లో సత్తా చాటాలి

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రజల్లో ఉండే గులాబీ జెండాయే తెలంగాణ ప్రజల గుండె ధైర్యమనే విషయాన్ని నిరూపించాలని సూచించారు. భద్రాచలం ఉప ఎన్నిక వచ్చినప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకుల మంతా వెళ్లి ఆ సీటును అద్భుతమైన మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఏ ఎన్నిక వచ్చినా ఢిల్లీ పార్టీలను నమ్మి మోసపోవద్దని, ఇంటి పార్టీలే ముద్దు అని సూచించారు.

బీఆర్ఎస్ పథకాల రద్దే లక్ష్యమా?

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను రద్దు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని కేటీఆర్ ఫైర్ అయ్యారు. 17 నెలలుగా ఏ కష్టం వచ్చినా నిలబడేది బీఆర్ఎస్ పార్టీయేననే విషయాన్ని మర్చిపోవద్దని కార్యకర్తలకు సూచించారు. సభలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య, బానోతు హరిప్రియా నాయక్, మెచ్చా నాగేశ్వర్‌రావు, బానోతు మదన్‌లాల్, తాటి వెంకటేశ్వర్లు, కొండబాల కోటేశ్వరరావు, జడ్పీ, డీసీసీబీ, సుడా, ఖమ్మం ఏఎంసీ, సత్తుపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, ఆర్‌జేసీ కృష్ణ, కూసంపూడి మహేశ్, భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటేటి కిరణ్‌కుమార్, రాయల శేషగిరిరావు కుమారులు రేవంత్, రఘునందన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి ఐఎన్‌టీయూసీ నాయకులు

కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సహా పలువురు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. తల్లాడ మండలం మిట్టపల్లిలో వీరందరికీ ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ యాకుబ్‌పాషా, సుభానీ, సలీంపాషా, చాంద్‌పాషా, భద్రాద్రి జిల్లాకు చెందిన తోటమళ్ల బాలయోగి తదితరులున్నారు. మాజీ మంత్రి పువ్వాడ, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుల ఆధ్వర్యంలో ఈ చేరికలు కొనసాగాయి.

పాక్‌కు బిలియన్ డాలర్ల ఐఎంఎఫ్ రుణం

- ఆ దేశ ప్రధాని కార్యాలయం వెల్లడి
- ఐఎంఎఫ్ ఓటింగ్‌కు భారత్ గైర్హాజరు

న్యూఢిల్లీ, మే 9: పాకిస్థాన్‌కు 1 బిలియన్ డాలర్ల రుణాన్ని విడుదల చేయడానికి అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) శుక్రవారం ఆమోదం తెలిపింది. పాక్ ప్రధాని కార్యాలయం ఈ విషయం వెల్లడించింది. ఐఎంఎఫ్ బోర్డు సమావేశం శుక్రవారం వాషింగ్టన్‌లో జరిగింది. పాక్‌కు ఉద్దీపన ప్యాకేజీపై జరిగిన ఓటింగ్‌కు భారత్ గైర్హాజరైంది. గతంలో ఇచ్చిన ఆర్థిక సహాయాన్ని సమర్థంగా ఉపయోగించుకోవడంలో, ఐఎంఎఫ్ షరతులను పాటించడంలో పాకిస్థాన్ పదేపదే విఫలమవుతున్నదని తెలిపింది. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాలుస్తున్న తరుణంలో భారత్ ఈ నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌కు అందచేస్తున్న రుణాలు సైనిక నిఘా కార్యకలాపాలకు, భారత భూభాగంపై దాడులు నిర్వహించిన లష్కరే తాయిబా, జైషే మహమ్మద్ వంటి ఉగ్ర గ్రూపులకు పరోక్షంగా సాయపడుతున్నాయని భారత్ మొదటినుంచి వాదిస్తోంది. సీమాంతర ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకోనంత వరకు పాకిస్థాన్‌కు ఆర్థిక సహకారం అందచేయవద్దని ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు విజ్ఞప్తి చేస్తోంది.

రుణాల కోసం పాక్ పాకులాట

- ఆపై ఎక్స్ ఖాతా హ్యాక్ అయిందని బుకాయింపు
- యాచించేందుకు ఇదో మార్గమని భారత్ ఎద్దేవా



న్యూఢిల్లీ: యుద్ధం అంటూ వస్తే భారత్ అంతు తేలుస్తామని డాంబికాలు పలికిన పాకిస్థాన్.. భారత్‌తో రెండు రోజుల ఘర్షణకే చేతులెత్తేసింది. ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తం కావడంతో రుణాల కోసం దేబిరిస్తోంది. పొరుగుదేశం ఇండియా కారణంగా కలిగిన భారీ నష్టం నేపథ్యంలో అంతర్జాతీయ భాగస్వాములు మరిన్ని రుణాలిచ్చి తమను ఆదుకోవాలంటూ పాకిస్థాన్ ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వశాఖ 'ఎక్స్' వేదికగా అభ్యర్థించింది. ఈ పోస్టు కాస్తా వైరల్ కావడంతో గంటలోనే ప్రభుత్వం స్పందించింది. తమ ఎక్స్ ఖాతా హ్యాక్ అయిందని, అంతర్జాతీయ రుణాల కోసం తాము ఎలాంటి ట్వీట్ చేయలేదంటూ మంత్రిత్వ శాఖ ప్రతినిధులు 'రాయిటర్స్'కు తెలిపారు. ఖాతాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. దీని స్క్రీన్‌షాట్‌ను ట్వీట్ చేసిన పాకిస్థాన్ సమాచార, ప్రసారశాఖ దానిని 'ఫేక్'గా కొట్టిపడేసింది.

పాక్ అడుక్కొనే తీరు ఇదీ..

రుణాల కోసం పాక్ చేసిన అభ్యర్థన పోస్టు, మళ్లీ 'ఫేక్' అంటూ చేసిన పోస్టులపై సోషల్ మీడియాలో మీమ్స్ పోటెత్తాయి. భారత ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన ఫ్యాక్ట్ చెకర్ 'పీఐబీ' కూడా దీనిపై మీమ్ పోస్ట్ చేసింది. 'యాచించేందుకు ఇదో మార్గమా?' అని ఎద్దేవా చేసింది.

కరాచీ పోర్ట్ నాశనమైంది

- నిజం చెప్పి ఆ తరువాత నాలుక్కర్చుకొన్న పాకిస్థాన్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): ప్రతీకార చర్యల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి భారత సైన్యం చేసిన దాడిలో కరాచీ పోర్టు తీవ్రంగా నాశనమైందంటూ మీడియాలో కథనాలు వెల్లడయ్యాయి. ఈ విషయాన్ని పాక్ స్వయంగా ఒప్పుకొన్నది. భారత్ చేసిన దాడుల్లో కరాచీ పోర్టు తీవ్రంగా నాశమైనట్టు పాక్ కరాచీ పోర్ట్ ట్రస్ట్ అఫీషియల్ ఎక్స్ ఖాతాలో శుక్రవారం ఉదయం ఓ పోస్ట్ కనిపించింది. ఇది కాస్తా వైరల్ కావడంతో సదరు పోస్ట్‌ను డిలీట్ చేసిన అధికారులు తమ ఖాతా హ్యాక్ అయ్యిందంటూ చెప్పుకొచ్చారు. దీంతో నిజం చెప్పి పాక్ నాలుక్కరుచుకొన్నదంటూ సోషల్‌మీడియాలో కామెంట్లు వెల్లువెత్తాయి.

'భారత సైన్యానికి 7.5 లక్షల ట్రక్కులు ఇస్తాం'

ఇండోర్, మే 9: మధ్యప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న 7.5 లక్షల ట్రక్కులను భారత సైన్యానికి అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ ప్రకటించింది. ఈమేరకు ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాసింది

యుద్ధకాలం.. అసత్య ప్రచారం

- సోషల్‌మీడియాలో పాకిస్థాన్ ఫేక్ వార్తలు
- ఫ్యాక్ట్‌చెక్ ద్వారా తిప్పికొడుతున్న పీఐబీ

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహిస్తున్న నేపథ్యంలో పాకిస్థాన్ తప్పుడు ప్రచారంతో సోషల్‌మీడియాలో కూడా వక్రబుద్ధిని చాటుకుంటున్నది. దాయాది చేస్తున్న అసత్య ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం తిప్పికొడుతున్నది. సామాజికమాధ్యమాల్లో ప్రసారమవుతున్న వార్తల్లో నిజానిజాలను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ఫ్యాక్ట్‌చెక్ ద్వారా తేటతెల్లం చేస్తున్నది. శుక్రవారం మీడియాలో పలు అంశాలు ప్రచారం కాగా, వాటిపై పీఐబీ ఫ్యాక్ట్ చెక్ చేసి, దేశప్రజలకు వాస్తవాలకు నివేదించింది. పాకిస్థాన్‌తోపాటు పలు మీడియా సంస్థలు కూడా పాత ఫొటోలు, వీడియోలను ప్రస్తుత యుద్ధానికి సంబంధించినవిగా చిత్రీకరిస్తూ అసత్యప్రచారానికి పూనుకుంటున్నది. దీనిపై భారత్ ముందస్తుగా స్పందిస్తూ వాస్తవాలు, పారదర్శకతతో తప్పుడు సమాచారానికి చెక్ పెడుతూనే ఉన్నది. దేశ ప్రజలు ఆందోళనకు, భావోద్వేగాలకు గురికాకుండా చూస్తున్నది. సందేహాలకు తావులేకుండా చేస్తున్నది. అంతేకాదు ప్రజలకు సైతం నకిలీ వార్తలను ఎలా గుర్తించాలో అవగాహన కల్పించే ప్రచారాలకు శ్రీకారం చుట్టింది.

1) పాకిస్థాన్ వైమానికదళం శ్రీనగర్ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుందని, పలు జెట్ విమానాలను కూల్చడంతోపాటు, భారత సైనికులను పట్టుకుందని, ఈ దాడిలో భారత్ తీవ్రంగా నష్టపోయిందని పాకిస్థాన్ మీడియా చానళ్లు ప్రచారం చేశాయి. పాక్ మంత్రులు సహా ఉన్నతాధికారులు ఆ కంటెంట్‌ను ప్రచారం చేశారు. భారత్ దీనిపై వెంటనే స్పందించింది. రియల్‌టైమ్ ఫ్యాక్ట్‌చెకింగ్ ద్వారా ఆ వీడియో మూలాలను గుర్తించింది. పాక్ అసత్య ప్రచారానికి చెక్ పెట్టింది. వాస్తవానికి ఆ దృశ్యాలు 2024 ప్రారంభంలో పాకిస్థాన్‌లోని ఖైబర్‌లో జరిగిన మత ఘర్షణలకు సంబంధించినవి.

2) భారత బ్రిగేడ్ ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేసినట్టు పాకిస్థాన్ మరో పుకారును సృష్టించింది. దానిని కూడా భారత్ తేటతెల్లం చేసింది. సెప్టెంబర్ 2024లో రాజస్థాన్‌లోని బార్మర్‌లో ఎంఐజీ 29 జెట్ క్రాష్ అయింది. ఆ పాత చిత్రాన్నే వక్రీకరించి పాకిస్థాన్ అనుకూల సోషల్ మీడియా అసత్య ప్రచారానికి తెరతీసింది. దానిని కూడా భారత్ ఆధారాలతో బయటపెట్టింది.

3) కశ్మీర్‌లో కనీసం 3 భారతీయ జెట్‌లు కూలిపోయాయని చైనా డైలీ ప్రచారానికి పూనుకుంది. అయితే భారత్ దానిలో నిజానిజాలను బయటపెట్టింది. చైనా డైలీ ప్రచారం చేసిన చిత్రం 2019 నాటి ఒక సంఘటనకు సంబంధించిందని ఆధారాలతో బయటపెట్టింది.

4) జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పేరిట ఫేస్‌బుక్‌లో దుండగులు ఒక ఫేక్ అకౌంట్‌ను సైతం సృష్టించారు. పాకిస్థాన్ రహస్యంగా సైబర్ అటాక్స్ చేస్తున్నదని, పౌరులు మెస్‌జ్‌లను క్లిక్ చేయవద్దని తెలుపుతూ ఆ అకౌంట్‌లో ఒక పోస్టును పెట్టారు. భారత్ వెంటనే దీనిపై స్పందించింది. అజిత్ దోవల్‌కు ఫేస్‌బుక్ అకౌంటే లేదని తేల్చిచెప్పింది. నకిలీ ప్రొఫైల్ అని వెల్లడించింది.

5) ముజఫరాబాద్‌లో సుఖోయ్ 30ఎంకేఐ విమానం కూలిపోయిందని, అందులో ఒక భారతీయ పైలట్ సజీవంగా ఉన్నాడని పాకిస్థాన్ సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రచారానికి పూనుకున్నాయి. అయితే అది అవాస్తమని భారత్ తేల్చింది. భారత వైమానిక దళానికి చెందిన ఈ సుఖోయ్ 2014 అక్టోబర్14 మహారాష్ట్రలోని పూణే-అహ్మద్‌నగర్ హైవే సమీపంలోని కుల్వాడి గ్రామంలోని ఉండ్రేవస్తి వద్ద కూలిపోయింది. దానిని తాజా యుద్ధానికి సంబంధించిందంటూ పాక్ వక్రీకరించింది. ఆ పోస్ట్‌ను షేర్ చేయవద్దని భారత్ స్పష్టంచేసింది.

6) జమ్ము వైమానికదళ స్థావరంలో భారీగా వరుస పేలుళ్లు జరిగాయని కూడా పాక్ ప్రచారానికి తెరతీసింది. దాన్ని కూడా భారత్ తిప్పికొట్టింది. పాక్ ప్రచారం చేస్తున్న ఫొటో ఆగస్టు 2021లో కాబూల్ విమానాశ్రయంలో జరిగిన పేలుడుకు సంబంధించినదని బహిర్గతం చేసింది. తప్పుడు సమాచారంతో మోసపోవద్దని, కంటెంట్‌ను షేర్ చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని పౌరులకు సూచించింది.

7) జలంధర్‌లో జరిగిన డ్రోన్ దాడికి సంబంధించిన వీడియోను ప్రజల్లో భయాందోళనలను సృష్టించడానికి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయితే అది ఎప్పుడో పొలాల్లో జరిగిన అగ్నిప్రమాదానికి సంబంధించిన వీడియో అని తేల్చింది. అదేవిధంగా పాకిస్థాన్ సైన్యం ఒక భారతీయ సైనికపోస్ట్‌ను నాశనం చేసిందని, అందుకు సంబంధించినదిగా చెప్తూ ఓ వీడియో వైరల్ చేసింది. అది అసత్యమని పీఐబీ గుర్తించింది. భారత సైన్యంలో "20 రాజ్ బెటాలియన్" అనే యూనిట్ లేదని, ఆ వీడియో ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రచారం చేస్తున్నారని తెలిపింది.

8) భారతదేశంపై పాకిస్థాన్ ప్రతీకారంగా క్షిపణి దాడి చేసిందనే సోషల్ మీడియాలో ఓ వీడియో చక్కర్లు కొడుతున్నది. అయితే అది కూడా అసత్యమని పీఐబీ నిర్ధారించింది. షేర్ చేసిన వీడియో 2020 సంవత్సరంలో లెబనాన్‌లోని బీరుట్‌లో జరిగిన పేలుడుకు సంబంధించినదని తేల్చిచెప్పింది.

9) జమ్ముకశ్మీర్‌లోని రాజౌరిలో ఆర్మీ బ్రిగేడ్‌పై ఫిదాయీన్ దాడి జరిగిందనేది కూడా అసత్యమని పీఐబీ నిర్ధారించింది.

10) సైనిక సిబ్బంది (సీవోఏఎస్) చీఫ్ జనరల్ వీకే నారాయణ్, నార్తర్న్ కమాండ్ ఆర్మీ అధికారికి సైనిక సంసిద్ధతకు సంబంధించి ఒక రహస్య లేఖను పంపారనేదిని అబద్ధమని, జనరల్ వీకే నారాయణ్ సీవోఏఎస్ కాదని, ఆ లేఖ పూర్తిగా నకిలీదని పీఐబీ స్పష్టంచేసింది.

11) భారత సైన్యం అమృత్‌సర్‌లోని సొంత పౌరులపై దాడి చేయడానికి అంబాలా ఎయిర్‌బేస్‌ను ఉపయోగించుకుందని కూడా పాకిస్థాన్ సోషల్‌మీడియాలో అసత్యప్రచారం చేసింది. ఇది పూర్తిగా అవాస్తవమంటూ పీఐబీ తెలిపింది.

12) భారతదేశంలోని విమానాశ్రయాల్లోకి ప్రయాణికులను నిషేధించారని కూడా ఒక పోస్ట్ వైరల్‌గా మారింది. ఆ నకిలీ కథనాన్ని పీఐబీ ఖండించింది. అసత్య ప్రచారాలు, వైరల్ అవుతున్న చిత్రాలు, వీడియోలకు సంబంధించిన వాస్తవాలను ఎప్పకప్పుడు రట్టు చేస్తూ పాక్, దాని అనుకూల శక్తుల ప్రచారానికి అడ్డుకట్ట వేస్తున్నది.

పౌరుల ప్రాణాలే పణంగా

- భారత్ ప్రతిదాడులను తప్పించుకోవడానికి కవచాలుగా పౌర విమానాలు వాడిన పాక్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): ఉగ్రదాడులను ఎగదోసి ఆపై భారత్ చేతిలో చావుదెబ్బలను తింటున్న దాయాది పాకిస్థాన్.. సాధారణ పౌరులను కూడా కవచాలుగా వాడుకొంటున్నది. శుక్రవారం రాత్రి భారత్‌లోని పలు ప్రాంతాలపై డ్రోన్ దాడులకు తెగబడ్డ పాక్.. దీనికి ప్రతిగా భారత్ ఎదురుదాడి చేస్తే ఏం చేయాలన్నదానిపై ముందుగానే నిర్ణయానికి వచ్చింది. ఇందులో భాగంగా తమపై భారత్ ప్రతిదాడులు జరుపకుండా ఉండేందుకు పౌర విమానాలను కవచాలుగా వాడుకొన్నది. ఈ మేరకు భారత్‌పై డ్రోన్ దాడులు జరుగుతున్న సమయంలో రెండు ప్రయాణికుల విమానాలు లాహోర్ సమీపంలో ప్రయాణించినట్టు ఎన్డీటీవీ ఓ కథనంలో వెల్లడించింది. దీనికి సంబంధించి ఫ్లైట్ ట్రాకింగ్ ఫొటోలను ప్రచురించింది. దీంతో పౌరుల ప్రాణాలను కూడా పాక్ పణంగా పెడుతుందంటూ సోషల్‌మీడియాలో కామెంట్లు కనిపించాయి.

ఈ నెల 15 వరకు 24 ఎయిర్‌పోర్టుల మూసివేత!

న్యూ ఢిల్లీ: భారత్-పాకిస్థాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో దేశంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లోని మొత్తం 24 ఎయిర్‌పోర్టులను ఈ నెల 15 వరకు మూసి ఉంచనున్నట్టు తెలిసింది. ఈ మేరకు సంబంధిత వర్గాలు తెలిపినట్టు పీటీఐ కథనం పేర్కొంది. ఇప్పటికే ఈ 24 ఎయిర్‌పోర్టుల్లో పౌర విమానాలను నేటి (శనివారం) వరకు మూసి ఉంచారు. ఈ నేపథ్యంలో తమ ఫ్లైట్లను ఈనెల 15 వరకు రద్దు చేస్తున్నట్టు పలు ఎయిర్‌లైన్స్ ప్రకటించాయి. శ్రీనగర్, చండీగఢ్, అమృత్‌సర్, లూధియానా, భుంతార్, కిషన్‌గఢ్, పటియాలా, షిమ్లా, ధర్మశాల, భటిండా, జైసల్మేర్, జోధ్‌పూర్, లేహ్, బికనేర్, పఠాన్‌కోట్, జమ్ము, జామ్‌నగర్, భూజ్‌లలో ఎయిర్‌పోర్టులను ఈనెల 15 సాయంత్రం 5.29 గంటల వరకు మూసి ఉంచనున్నారు. ఆయా ఎయిర్ పోర్టుల్లో తమ విమాన సేవలను ఎయిర్ ఇండియా వెల్లడించింది.

అవసరమైతే సైన్యంలో చేరేందుకు సిద్ధం: ఉత్తమ్

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరినవేళ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మీడియాతో మంత్రి చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను 16 ఏండ్లకే సైన్యంలో చేరినట్టు గుర్తుచేశారు. మిగ్-21 ఫైటర్ జెట్ పైలట్‌గా పనిచేశానని చెప్పుకొచ్చారు. యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్న వేళ మాజీ సైనికుల సేవలు అవసరమని పిలుపు వస్తే మరోసారి సైన్యంలో చేరేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు.

మీడియా.. తస్మాత్ జాగ్రత్త!

- యుద్ధవార్తలపై జాగ్రత్తలు పాటించాలి
- మీడియా చానళ్లు, వార్తా ఏజెన్సీలకు సమాచార, ప్రసారశాఖ ఆదేశాలు

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): యుద్ధవార్తల ప్రసారంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రజలకు చేరవేసే ముందే నిజానిజాలు నిర్ధారించుకోవాలని కేంద్ర సమాచార, ప్రసారశాఖ అన్ని మీడియా సంస్థలు, న్యూస్ ఏజెన్సీలకు ఆదేశాలు జారీచేసింది. దేశరక్షణ, భద్రతాపరమైన వార్తలు ప్రసారం చేసే సందర్భంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, చట్టానికి లోబడి, నియమ నిబంధనలు పాటించాలని సూచించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జాతీయ భద్రతా అంశాలను పరిగణనలోకి తీసుకొని, ఫ్యాక్ట్ చెక్ చేసుకొని వార్తలు ప్రసారం చేయాలని సూచించింది. ఉగ్రవాద నిరోధక చర్యలకు సంబంధించిన లైవ్ కవరేజీలు, వ్యక్తిగత అభిప్రాయాలు ఫేక్ వార్తలు ఇవ్వొద్దని సూచించింది. తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరించింది. మతపరమైన, ఉద్రిక్తతలు కారణమయ్యే ఘటనల వీడియోలను షేర్ చేయొద్దని సూచించింది.

'డిఫెన్స్' ఫండ్‌కు ప్రజాప్రతినిధుల విరాళం!

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు వివిధ వర్గాలు విరాళాలు ఇచ్చేందుకు ముందుకొస్తున్నాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక నెల వేతనం విరాళంగా ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. ఈ అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సీఎం చర్చించారు. తమ ఒకరోజు వేతనాన్ని నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కే చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి భాస్కరరావు తెలిపారు.